## రేపు నిధి ఆప్‌కే నిఖత్

నిజామాబాద్ స్పోర్ట్స్, అక్టోబర్ 25 : నిధి ఆప్ కే నిఖత్ 2.0 కార్యక్రమాన్ని ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు నిజామాబాద్ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ గణేశ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రావణ్‌కుమార్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని ప్రెసిడెన్సీ హైస్కూల్‌లో, కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే అక్కడికక్కడే పరిష్కరించేందుకు కృషిచేస్తామని తెలిపారు.

## శంభుని ఆలయ చైర్మన్‌కు సన్మానం

ఖలీల్‌వాడి, అక్టోబర్ 25 : నగరంలోని శంభుని ఆలయ చైర్మన్‌గా ఇటీవల నియామకమైన శివాజీనగర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు గాండ్ల లింగాన్ని సంఘ సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. జిల్లాకేంద్రంలోని సంఘ భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రధానకార్యదర్శి శెట్టి రాజు, ఉపాధ్యక్షుడు బంటు నరేందర్, సంయుక్త కార్యదర్శి నాంచారి యతిన్, కోశాధికారి ఆర్మూర్ రత్నాకర్, సభ్యులు, పెద్దకాపులు తదితరులు పాల్గొన్నారు.

## జీపీ సిబ్బందికి దుస్తుల అందజేత



పంచాయతీ కార్మికులకు దుస్తులను అందజేస్తున్న రైజింగ్ యూత్ సభ్యులు

ఇందల్వాయి, అక్టోబర్ 25 : మండలంలోని సిర్నాపల్లి గ్రామపంచాయతీ కార్మికులకు రైజింగ్ యూత్ ఆధ్వర్యంలో దుస్తులను బుధవారం అందజేశారు. యూత్ సభ్యులను సర్పంచ్ తేలు విజయ్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు భూమేశ్, కోశాధికారి గణేశ్, కార్యదర్శి వడ్లూరి సంతోష్, సభ్యులు రాకేశ్, బ్రహ్మం, సంజీవ్, ప్రసాద్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 28న చంద్రగ్రహణం

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 23 : ఈనెల 28వ తేదీన అర్ధరాత్రి పాక్షిక చంద్రగ్రహణం ఏర్పడుతుందని ప్రముఖ జ్యోతిష్య పండితుడు పవన్ జోషి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్ధరాత్రి 1.06 నుంచి నుంచి అర్ధరాత్రి 2.25 గంటల వరకు గ్రహణ ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. అశ్విని, మేష, తుల, మీనరాశి వారు గ్రహణాన్ని చూడవద్దని తెలిపారు. చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం 4 నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు ఉమ్మడి జిల్లాలోని ఆలయాలను మూసి ఉంచుతారని, సంప్రోక్షణ అనంతరం పూజలు కొనసాగుతాయని తెలిపారు.

## జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

డిచ్‌పల్లి, అక్టోబర్ 25 : మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన కొక్కుల గంగాధర్ (45) బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## బైక్‌పై నుంచి పడిన బాలుడి మృతి

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 25 : నిజామాబాద్ నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన బాలుడు దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ఈ నెల 24న అర్ధరాత్రి 12 గంటల సమయంలో బైక్‌ను నేనావత్ నితిన్ నడుపుతుండగా.. నేనావత్ శ్రీనివాస్ (17) బైక్ వెనకాల కూర్చున్నాడు. బైక్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో వెనకాల కూర్చున్న శ్రీనివాస్ కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు బలమైన గాయాలు కాగా.. దవాఖానలో చేర్పించారు. బాలుడి పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా పోశెట్టి

ఖలీల్‌వాడి, అక్టోబర్ 25 : ఎమ్మార్పీఎస్ అనుబంధ సంస్థల జిల్లా కో-ఆర్డినేటర్‌గా సరికెల పోశెట్టిని మందకృష్ణ మాదిగ ఇటీవల నిర్వహించిన సమావేశంలో నియమించారు. జిల్లాలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌పీఎస్, ఎంఎంఎస్ లకు పోశెట్టి అనుసంధాన కర్తగా ఉంటారని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో జిల్లా కో-ఆర్డినేటర్ బాధ్యతలను అప్పగించినందుకు మందకృష్ణ మాదిగకు పోశెట్టి కృతజ్ఞతలు తెలిపారు.

# పోలీస్‌గ్రౌండ్‌లో 'ఓపెన్ హౌస్'

- ఆయుధాల ప్రదర్శన
- వాటి పనితీరుపై అధికారుల అవగాహన



ఆయుధాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 25 : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలను చేపడుతున్నారు. ఫ్లాగ్ డే సందర్భంగా నగరంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సీపీ కల్మేశ్వర్, బీఎస్ఎఫ్ కమాండెంట్ ఆర్ఎస్.బాటి కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 303 రైఫిల్, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, ఏకే 47, 9 ఎంఎం కార్బన్ గన్, గ్యాస్ గన్, యాంటి రైడ్ గన్, పిస్టల్, రివాల్వర్, గ్రేనేట్, ఎల్ఎంజీతోపాటు బాంబ్ స్క్వాడ్‌పై అధికారులు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ గిరిరాజు, నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పల నాయుడు, పోలీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షకీల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఉన్న ప్రశాంతి నిలయంలో రక్తదాన శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. సీపీ కల్మేశ్వర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా.. 27 మంది పోలీస్‌సిబ్బంది రక్తదానం చేశారు. జిల్లా ప్రభుత్వ దవాఖాన పాథాలజిస్ట్ డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ ఇమ్రాన్ అలీ ఆధ్వర్యంలో ఈ శిబిరం కొనసాగింది. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పోలీసు సిబ్బంది

## ఇంటింటా బూత్ లెవల్ కమిటీ ప్రచారం

మోస్రా (చందూర్), అక్టోబర్ 25 : మోస్రా మండలంలోని చింతకుంట గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటా బూత్ లెవల్ కమిటీ ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పిట్ల ఉమాశ్రీ రాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఫెరోజ్, సాయాగౌడ్, విమలాలింగయ్య, రవీందర్‌గౌడ్, నాగుల స్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చింతకుంటలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు, బీఆర్ఎస్ శ్రేణులు

## 29న పద్మశాలీ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం



ఎమ్మెల్యే బాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌ను ఆహ్వానిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 25 : బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా 29న పద్మశాలీ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. సమ్మేళనానికి హాజరుకావాలని కోరుతూ ఆ సంఘం నాయకులు బాజిరెడ్డి గోవర్ధన్, ఎన్నికల ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌ను బుధవారం ఆహ్వానించారు. డిచ్‌పల్లి మండలకేంద్రంలోని ఎస్ఎల్‌జీ గార్డెన్‌లో సమ్మేళనం ఉంటుందని, రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన సుమారు మూడు వేల మంది పద్మశాలీ కులస్తులు హాజరుకానున్నట్లు తెలిపారు. బాజిరెడ్డిని కలిసిన వారిలో పద్మశాలీ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పూల్గం హన్మాండ్లు, నగర అధ్యక్షుడు గుజ్జేటి వెంకటనర్సయ్య, రూరల్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిలువేరి దాసు, శక్కరికొండ కృష్ణ, చింత మహేశ్, చిలుక రాజేశ్వర్, అంకం నరహరి, శ్రీపతి, శేఖర్, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



పాతంగల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ రమేశ్

కోటగిరి, అక్టోబర్ 25 : పొతంగల్ మండలకేంద్రంలోని రైస్‌మిల్ ఆవరణలో వ్యవసాయ విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ రమేశ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం ఏ-గ్రేడ్ రకానికి రూ.2,203, బీ-గ్రేడ్ రకానికి రూ.2,183 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. కార్యక్రమంలో విండో సీఈవో భరత్, గిర్దావర్ సాయిలు, పంచాయతీ కార్యదర్శి యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన శోభాయాత్ర

- పోలీసుల భారీ బందోబస్తు
- ప్రార్థనా మందిరాల వద్ద ప్రత్యేక పికెట్

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 25 : జిల్లాలో మంగళవారంతో నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో దేవీ మాత నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని సీపీ కల్మేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాల్లో చేపట్టిన నిమజ్జన శోభాయాత్రకు పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. ఏసీపీల పర్యవేక్షణ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌వోలు, ఎస్సైలు తమ సిబ్బందితో కలిసి మంగళవారం మధ్యాహ్నం నుంచి శోభాయాత్ర సాగే అన్ని రూట్లలో భద్రతా ఏర్పాట్లు చేశారు. బందోబస్తులో సివిల్ పోలీస్ సిబ్బందితోపాటు స్పెషల్ పార్టీ బలగాలు, సెంట్రల్ సిబ్బందిని సైతం రంగంలోకి దింపారు. అన్ని ప్రార్థనా మందిరాల వద్ద ప్రత్యేక పికెట్లను ఏర్పాటు చేశారు. దీంతోపాటు మొబైల్ పెట్రోలింగ్ బృందాలతో సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు శోభాయాత్ర కొనసాగగా.. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శోభాయాత్ర నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పలు ప్రాంతాల్లో వాహనాలను దారి మళ్లించారు.



బందోబస్తులో పాల్గొన్న మహిళా పోలీసులు